ప్రజాశక్తి
ఆదివారం 7 సెప్టెంబరు, 2025
5
శ్రీకాకుళం



రేపు టెన్నికాయిట్ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి – పలాస

పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో రాష్ట్ర టెన్నికాయిట్ పోటీలకు స్త్రీ, పురుషులను ఈ నెల 8న జిల్లా జట్టును ఎంపిక చేస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మల్ల సంతోష్‌కుమార్, కార్యదర్శి సుడియా జోగారావు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 2 గంటల నుంచి నిర్వహించనున్న ఈ పోటీల్లో పాల్గొనున్న క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరుకావాలన్నారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.తవిటయ్య ఆధ్వర్యాన ఎంపికలు నిర్వహస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగం చేసుకోవాలని కోరారు.

అమెరికా టారిఫ్‌లను వ్యతిరేకించాలి

వామపక్షాల నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి– శ్రీకాకుళం సిటీ

అమెరికా టారిఫ్‌లను వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అన్నారు. అమెరికా టారిఫ్ పెంపునకు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యాన అంబేద్కర్ కూడలి వద్ద శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50 శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందని అన్నారు. ఆక్వా, టెక్స్‌టైల్, గార్మెంట్స్ వంటి ఉత్పత్తుల ధరలు ఘోరంగా పడిపోయాయని పేర్కొన్నారు. దేశ సముద్ర ఉత్పత్తుల్లో 40 శాతం ఎగుమతులు ఆంధ్రప్రదేశ్ నుంచి అవుతున్నాయని అన్నారు. ఏటా సుమారు రూ.2 వేల కోట్ల డాలర్ల విలువైన ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి మన రాష్ట్రం నుంచి అవుతున్నాయని



ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

చెప్పారు. రొయ్యల ధరలు ఘోరంగా పడిపోవడంతో సముద్ర తీర ప్రాంతాల్లోని రొయ్యలు, చేపల రైతులు తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నారని అన్నారు. అలాగే గార్మెంట్స్, టెక్స్‌టైల్స్ రంగాల్లో ఫ్యాక్టరీలు, స్పిన్నింగ్ మిల్లుల్లో పనిచేస్తున్న వేలాది మంది కార్మికుల ఉపాధికి ఎసరు వస్తోందని చెప్పారు. ఇందులో అత్యధికులు మహిళా శ్రామికులనేని అన్నారు. మన ఎగుమతులపై సుంకం పెంచి మరో వైపు అమెరికా నుంచి వ్యవసాయ ఉత్పత్తులనుపన్నులు లేకుండా దిగుమతి చేసుకోవాలని డిమాండ్ చేస్తోందని అన్నారు. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు ఆపాలని షరతులు పెడుతుందని తెలిపారు. అమెరికా వీసాలకు నిబంధనలు కఠినతరం చేయడం, కాలపరిమితిని తగ్గించడం, జరిమానాలు విధించడం వంటి కారణాలతో ఎన్నో ఆశలతో ఉన్నత విద్యనభ్యసించిన విద్యార్థుల కలలు పేకమేడల్లా కూలిపోతున్నాయని అన్నారు. ఇప్పటికే అమెరికా వెళ్లినవారి పరిస్థితీ ఆగమ్యాగో చరంగా ఉందని అన్నారు. ఇన్ని విధాలుగా ట్రంప్ సర్కారు భారత ప్రయోజనాలను, సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తున్నా కేంద్రంలోని మోడీ సర్కారు కిమ్మనకపోవడం గర్హనీయమని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు టిడిపి కూటమి ఏమాత్రం ప్రయత్నించకపోవడం సరికాదన్నారు. మన దేశ ప్రయోజ నాలు కాపాడేందుకు, సార్వభౌమత్వ పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలబడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్షాలు నాయకులు బి.కృష్ణ మూర్తి, పి.తేజేశ్వరరావు నాయకులు కె.నాగమణి, సిహెచ్.అమ్మన్నాయుడు, ఎస్.లక్ష్మీనారాయణ, పోలాకి ప్రసాదరావు, డి.రమణారావు, ఎన్.వి.రమణ, ఆర్.ప్రకాశరావు, కొత్తకోట అప్పారావు బి.గోపి టి.తిరుపతిరావు, సంతోష్ పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాకే ప్లాట్లు

నిర్వాసితుల వ్యతిరేకతతో లాటరీ వాయిదా

ప్రజాశక్తి– సంతబొమ్మాళి

సంతబొమ్మాళి మండలంలోని మూలపేట పోర్టు నిర్వాసితులకు శనివారం లాటరీ ద్వారా ఫ్లాట్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టేందుకు ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి రావడంతో నిర్వాసితుల నుంచి వ్యతిరేకత ఎదురైంది. నిర్వాసిత కాలనీలో కనీసం మౌలిక వసతులు ఇంకా పూర్తికాకుండానే ఫ్లాట్ల కేటాయింపు ఎలా చేస్తారని టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ జీరు భీమారావు, కోట నారంనాయుడు తదితరులు వ్యతిరేకించారు. నౌపడ పునరావాస కాలనీలో సర్పంచ్ బాబూరావు ఆధ్వర్యాన లాటరీ కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో తొలుత మాట్లాడుతూ మూలపేటకు చెందిన 506 పిడిఎఫ్లకు 90 క్లస్టర్లుగా విభజించామని తెలిపారు. ఒక్కో క్లస్టర్‌లో వారి బంధువర్గం, అన్నదమ్ములు ఉన్నట్లయితే వారంతా ఒకచోటే నిర్మాణం చేసుకోవచ్చని తెలిపారు.



ఆర్‌డిఒను ప్రశ్నిస్తున్న మూలపేట నిర్వాసితులు

ఒక్కో పిడిఎఫ్కు ఐదు సెంట్లు స్థలం, 10.47 లక్షలు పరిహారం గతంలో అందజేశారు. అయితే పెండింగ్‌లో ఉన్న 16 పిడిఎఫ్‌లకు సంబంధించి రెండు ఇంట్ల స్థలంతో, రూ.5 లక్షలు మాత్రమే నష్టపరిహారం ఇస్తామనడంతో తీవ్రమైన గందరగోళం ఏర్పడింది. అందరికీ ఒకేలా పరిహారం ఇప్పించాలని, దీనికి అంగీకరిస్తేనే ఫ్లాట్ల కేటాయింపుకు ఒప్పుకుంటామని నిర్వాసితులు కరాకండిగా తేల్చి చెప్పారు. డ్రైనేజీలు రోడ్లు నిర్మాణం చేసి ఇస్తామని ప్రకటించారు. అలాగే గ్రామంలోని అన్ని ఆలయాలకు నష్టపరిహార అంచనాలు వేసి గ్రామాని కి చెందిన ఖాతాలో జమ చేస్తామని చెప్పారు. లాటరీకి సహకరించాలని ఆర్‌డిఒ కోరారు. దీనిని నిర్వాసితులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆలయాలకు ఇచ్చిన నష్టపరిహారం సరిపోందన్నారు. అలాగే పూర్తిస్థాయిలో మౌలిక వస్తువులు కల్పించిన తర్వాతే ఫ్లాట్ల కేటాయించాలని కోరారు. నిర్మాణ పనులు జరుగుతుండగానే ఫ్లాట్ల కేటాయించడం తొందర ఎందుకని ఆర్‌డిఒను ప్రశ్నించారు. గ్రామంలో ఇప్పటివరకు పెండింగ్‌లోని 16 పిడిఎఫ్ ప్యాకేజీలు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం మూలపేటలో ఉన్న ఇళ్ల నష్టపరిహాల అంచనాలు మళ్లీ వేయాలని అంతవరకు లాటరీకి ఒప్పుకోమని తెలిసి చెప్పారు. గతంలో చెప్పిన డిమాండ్లన్నీ నెరవేర్చిన తర్వాతే లాటరీ వెయ్యాలని సమావేశం నుంచి వెళ్లిపోయారు. దీంతో చేసేది ఏమీ లేక అధికారులు ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ వాయిదా వేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ హేమసుందర్, టెక్కలి రూరల్ సిఐ కె.శ్రీనివాసరావు, నౌపడ ఎస్ఐ నారాయణస్వామి, సంతబొమ్మాళి ఎస్ఐ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. టెక్కలి క్యాంప్ కార్యాలయంలో శనివారం ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు మంత్రికి అర్జీలు అందజేసి సమస్యలను విన్నవించుకున్నారు. ప్రజల వినతులను సావధానంగా విని పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. పట్టణంలోని వెంకటేశ్వర కాలనీ 3 లైన్‌లోని ఎగువ ప్రాంత భాగంలో సిసి రోడ్లు నిర్మించాలని మహిళలు కోరారు. వంశధార కాలనీ సమీపంలోని సిమెంట్ రోడ్లు, తాగునీటి కుళాయి ద్వారా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వెనుకనున్న ఎన్‌టిఆర్ కాలనీకి వెళ్లే రోడ్డును మంజూరు చేయాలని కాలనీ వాసులు కోరారు. వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని మండల ఇంజినీరింగ్ అధికారి ఎస్.ఎల్.నాయుడును మంత్రి ఆదేశించారు. మండలంలోని దామోదపురంలో నిత్యవసర



వినతులను స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

సరుకులు తీసుకొనేందుకు గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, చిన్ననారాయణపురంలో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు వినతి సమర్పించారు. కొండ పోరంబోకు పట్టాలు మంజూరు చేయాలని నందిగాం మండలం కల్లాడ గ్రామస్తులు కోరారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ పనులు మెరుగు ప్రత్యేక దృష్టిసారించాలని, సుందరీకరణ పనులు చేపట్టాలని కార్యదర్శి శ్రీనివాస్‌ను ఆదేశించారు. ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ పనుల్లో భాగంగా వీధుల్లో మురుగు కాలువల్లో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్, చెత్త కుప్పలు తొలగింపు పనులు చేపట్టాలన్నారు. జగతిమెట్ట పాత జాతీయ రహదారి నుంచి ఆంజనేయ విగ్రహం వరకు బ్యూటీఫికేషన్ పనులు నిర్వహించాలన్నారు.

మెడికల్ కాలేజీలు ప్రైవేట్‌పరం చేయడం దారుణం

శాసనసభ మాజీ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి– టెక్కలి రూరల్

రాష్ట్రంలో మెడికల్ కాలేజీలు ప్రైవేట్‌పరం చేయడం దారుణమని వైసిపి పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త, శాసనసభ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. టెక్కలి వైసిపి కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. పిపిపి విధానం ద్వారా పది మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసి తనకు సంబంధించిన వ్యక్తులకు కట్టబెట్టి తద్వారా వేలకోట్లు దోచుకుని అవినీతికి పాల్పడేందుకు చంద్రబాబు పన్నాగం పన్నారని ఆరోపించారు. 2019-24 వరకు జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో 15 మెడికల్ కాలేజీలు ఏర్పాటులో భాగంగా ఐదు మెడికల్ కాలేజీలు



మాట్లాడుతున్న సీతారాం

ప్రారంభించారని అన్నారు. మిగతా మెడికల్ కాలేజీలు పనులు పూర్తి అయ్యాయ తెలిపారు. వీటిని చంద్రబాబు ప్రైవేట్‌పరం చేయడం దారుణమని, దీనిపై తక్షణం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని వైసిపి టెక్కలి నియోజకవర్గ సమన్వయర్త పేరాడ తిలక్‌లి ఆరోపించారు. రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయడంలో వ్యవసాయశాక మంత్రి కింజరాపు అచ్చెనాయుడు విఫలమయ్యారని అన్నారు.

9న ర్యాలీ ధర్నా

వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతు సమస్యలపైన, ఎరువుల కొరతపైన ఈ నెల 9న టెక్కలిలో భారీ ఎత్తున రైతులతో, వైసిపి నాయకులు, కార్యకర్తలతో అన్నదాత పోరు ర్యాలీ నిర్వహించి ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తామని తిలక్ తెలిపారు. అనంతరం అన్నదాత పోరు పోస్టల్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు దువ్వాడ వాణి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలి

ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం సిటీ : యువత స్వశక్తితో ఎదగాలంటే పరిశ్రమలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని నాగావళి హోటల్‌లో శనివారం నిర్వహించిన ఏంపవరింగ్ స్టాప్స్, బిజినెస్ ఓనర్స్ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నతరహా వ్యాపారులకు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రతి ఇంటి నుంచీ ఒక పారిశ్రామిక వేత్తను సిద్ధం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఆ దిశగా వారిని ప్రోత్సహిస్తూ వారికి కావాల్సిన అన్ని ప్రోత్సాహకాలు, శిక్షణ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. వ్యాపారం ప్రారంభించే వారికి బ్యాంకులు కూడా రుణాలు సకాలంలో ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. టూరిజం, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర రంగాల్లో వ్యాపారం చేయాలనుకునే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వారికి కావాల్సిన ఆహార ఉత్పత్తులు, ముడి సరుకులు కూడా అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. యువత స్వయంశక్తితో ఎదిగి మరి కొంతమందికి ఉద్యోగ ఉపాధి కల్పించాలని చెప్పారు. పారిశ్రామిక వేర్తలుగా యువత ఎదిగిన రోజు నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.



ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రణాళికాబద్ధంగా యూరియా పంపిణీ

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి– శ్రీకాకుళం సిటీ

ప్రణాళికాబద్ధంగా యూరియా పంపిణీ చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎరువుల పంపిణీపై తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎస్ఐలు, వ్యవసాయశాఖ ఎఒలతో ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి, జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎరువులకు సంబంధించి డివిజన్ స్థాయిలో ఆర్‌డిఒ, డిఎస్‌పి, వ్యవసాయశాఖ ఎడి ఉంటారని అన్నారు. ప్రతి మండలంలో రెవెన్యూ, పోలీసు వ్యవసాయశాఖ ఎఒ మండల స్థాయిలో టాస్కోర్స్ ఉంటుందని చెప్పారు. జిల్లాకు వచ్చే యూరియా ఆమదాలవలస గొడౌనులో నిల్వ చేసి అక్కడ నుంచి నేరుగా రైతు సేవా కేంద్రాలు, డిసిఎంఎస్, ప్రైవేటు వారికి సరఫరా అవుతుందని వివరించారు. జిల్లాకు వచ్చిన యూరియాలో 50 శాతం ప్రభు త్వానికి, 50 శాతం ప్రైవేటుకు సరఫరా చేస్తున్నామని అన్నారు. ప్రైవేట్ పంపిణీ కేంద్రాల వద్ద ఒక విఆర్‌ఎ, సచివాలయాల సిబ్బంది ఉండాలన్నారు. పంటల వారీగా డేటా వస్తుందన్నారు. ఎరువులు వస్తుందని రైతులకు ముందుగానే తెలియజేయాలన్నారు. అనంతరం ప్రణాళికాబద్ధంగా రైతులకు ఎరువులను పంపిణీ చేయాలన్నారు. ఒ క్కో రైతుకు ఎంత భూమి ఉంది, ఎంత ఎరువులు అవసరం అవుతుందో రైతులకు చెప్పాలన్నారు. యూరియా పంపిణీ వద్ద డిజిటల్ అసిస్టెంట్లు అసిస్టెన్స్ ఇవ్వాలని ఎంపిడిఒలను ఆదేశించారు. కూపన్లు ముందుగానే పంపిణీ చేయాలన్నారు. రోజూ ప్రైవేట్, రైతు సేవా కేంద్రాలు ప్రారంభం, ముగింపు నిల్వలు సాయంత్రం నాటికి తెలియజేయాలన్నారు. అవగాహన పోస్టర్లు డిస్‌ప్లే చేయాలన్నారు. రైతులకు సమస్య ఉంటే కంట్రోల్ రూం 9121863788 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. విఎఎ పోస్టులు ఖాళీగా ఉంటే తక్షణమే నియమించేందుకు చేసేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ జెడిని ఆదేశించారు. యూరియా పంపిణీపై రైతులకు భరోసా కల్పించాలన్నారు. యూరియా ఇస్తామని చెప్పి రైతుల వద్ద నుంచి డబ్బులు వసూళ్లు చేయరాదన్నారు. ఒకవేళ రైతుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేట్ షాపులు వద్ద యూరియా, ఇతర ఎరువులు కొనాలని, ప్రైవేటు యాజమాన్యం రైతులపై ఒత్తిడి చేయరాదని తెలిపారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, వర్చువల్‌లో ఆర్‌డిఒ, వ్యవసాయశాఖ జెడి త్రినాథస్వామి తదితరులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఎరువుల పంపిణీ పరిశీలన

శ్రీకాకుళం రూరల్ : మండలంలోని ఖాజీపేటలో రైతులకు ఎరువుల పంపిణీ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రైతు సేవా కేంద్రంలో పరిశీలించారు. సరఫరాలో ఎలాంటి లోపాలు చోటు చేసుకోకూడదని అధికారులను సూచించారు.



జెండా ఊపి ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ అనిత

ఎయిడ్స్‌ని తరిమికొడదాం

డిఎంహెచ్ఒ అనిత

ప్రజాశక్తి– శ్రీకాకుళం సిటీ

హెచ్ఐవి ఎయిడ్స్‌పై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె. అనిత అన్నారు. యూత్ ఫెస్ట్–25లో భాగంగా హెచ్ఐవి/ఎయిడ్స్‌పై చైతన్యం కోసం మారథాన్ 5కె రెడ్ రన్ 80 ఫీట్ రోడ్డులో వాంబే కాలనీ నుంచి మిల్లు కూడలి వరకు తిరిగి మిల్లు జంక్షన్ నుంచి వాంబే కాలనీ వరకు శనివారం రన్నింగ్ నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జెండా ఊపి ప్రారంభించారు. హెచ్ఐవి /ఎయిడ్స్ సంక్రమణ సెక్స్ పద్ధతి ద్వారా, సురక్షితం కాని సెక్స్, రక్తమార్పిడి, సిరంజీల మార్పిడి వల్ల ఒకరి నుంచి ఇంకొకరికి సంక్రమణ జరు గుతుందన్నారు. వ్యాప్తిపై అందరూ అవగాహన కలిగి, వ్యాప్తిని తగ్గించగలగాలి, అరికట్టేందుకు అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్ఐవి/ఎయిడ్స్, మాదకద్రవ్య వినియోగం గురించి యువతకు అవగాహన కల్పించడం, నివారణకు ఆరోగ్యకరమైన జీవనాన్ని ప్రోత్సహించడానికి ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. 5కె రన్‌లో 55 మంది పురుషులు, 15 మంది మహిళలు, ఇద్దరు ట్రాన్స్ జెండర్స్ పాల్గొన్నారు. పురుషుల విభాగంలో ప్రథమ బహుమతి ఆర్.మహేశ్వరరావు, ద్వితీయ బహుమతి టి.దివాకర్, మహిళా విభాగంలో ప్రథమ బహుమతి సిహెచ్.భార్గవి, ద్వితీయ బహుమతి కె.తేజేశ్వని, ట్రాన్స్‌జెండర్స్‌లో ప్రథమ బహుమతి జి. జగన్నాథం (మోక్ష), ద్వితీయ బహుమతి బి.వంశీకృష్ణ (సోన) గెలిపొందారు. ఇందులో ప్రథమ బహుమతి కింద రూ.పది వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.ఏడు వేలు సోమవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చేతుల మీదుగా ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎఆర్‌టి అధికారి పి.జె.అప్పలనాయుడు, డిఎల్ఎటిఒ టి.శ్రీకాంత్, బెజ్జిపురం యూత్ క్లబ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ప్రసాదరావు, సిపిఎం శైలజ, డిఎఎంఅండ్ డి.సంతోష్ పాల్గొన్నారు.

పదవుల పందేరమే పరమావధా?

ప్రజాశక్తి– శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో వివిధ ప్రభుత్వశాఖల్లో ఖాళీగా ఉన్న కీలక అధికారుల పోస్టులను భర్తీ చేయడం కన్నా కూటమి నాయకులకు నామినేటెడ్ పదవులు కట్టబెట్టడమే ప్రభుత్వం పరమావధిగా భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల పలు సామాజిక తరగతుల కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టరు, ఎఎంసి, పలు ప్రభుత్వశాఖలకు సంబంధించిన కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్లు వంటి నామినేటెడ్ పదవులను ఇటీవల వరుసగా నియమిస్తుండం చూస్తున్నాం. నామినేటెడ్ పదవుల పందేరంపై ఉన్న దృష్టి జిల్లాలోని ప్రధాన ప్రభుత్వశాఖల్లో కీలకమైన అధికారుల పోస్టుల భర్తీపై లేకపోవడంతో చాలా ప్రభుత్వశాఖలు లేక ఇంఛార్జిలతోనే నెట్టుకురావాల్సిన దుస్థితి ఏర్పడింది. అధికారి ఉద్యోగ విరమణ చేయడమో లేక బదిలీ కావడమో జరిగితే ఇక ఆ పోస్టు భర్తీ సంగతి అంతే అన్నట్లుగా జిల్లాలో ఉంది. పాలనా వ్యవహారాల కోసం కలెక్టర్ అప్పటికప్పుడు వారి స్థానంలో సీనియర్ అధికారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించడమో లేక పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించడమో చేస్తున్నారు తప్ప ప్రభుత్వం మాత్రం ఆ పోస్టులను భర్తీ చేయడం లేదు. దీంతో నెలల తరబడి అధికారులు లేక పాలన వ్యవహారాలు కుంటుపడుతున్నాయి. కొన్ని ప్రభుత్వశాఖలయితే ఏడాదికిపైగా ఇన్‌ఛార్జిలతోనే నెట్టుకొస్తున్నాయి. ఉదాహరణకు జిల్లాలో 1.48 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే కీలకమైన వంశధార ప్రాజెక్టుకు మూడు నెలలుగా ఎస్ఇని నియమించకపోవడం ప్రభుత్వ ఉదాసీనతకు అద్దం పడుతోంది. ఈ ఏడాది మేలో వంశధార ఎస్ఇ ఉద్యోగ విరమణ పొందటంతో విశాఖ, విజయనగరం జిల్లాలోని ప్రాజెక్టుల బాధ్యతలను చూసే స్వర్ణకుమార్‌ను ఇన్‌ఛార్జిగా నియమించి చేతులు దులుపుకుంది. ఆయనకు ఇంజినీర్ ఇన్ ఛీఫ్ ఉద్యోగోన్నతి రావడంతో ఆయన స్థానంలో మూడు జిల్లాల అవతల ఉన్న ధవళేశ్వరం ప్రాజెక్టు ఎస్ఇ శ్రీనివాసరావుకు ఇక్కడ బాధ్యతలు అప్పగించిందంటే ప్రాజెక్టులు, రైతులపై ఈ ప్రభుత్వం చిత్తశుద్ధి ఏమిటో అర్ధమవుతోంది. గృహ నిర్మాణశాఖదీ అదే పరిస్థితి. పీడీగా పని చేసిన గణపతి గతేడాది జూన్‌లో ఉద్యోగ విరమణ చేసిన తర్వాత సహకార శాఖలో పని చేస్తున్న నగేష్‌కు బాధ్యతలు అప్పగించారు. జూలైలో ఆయనకు రాజమండ్రి బదిలీ కావడంతో ఇన్‌ఛార్జి ఇఇగా పనిచేస్తున్న ఓ డిఇకు పీడీ బాధ్యతలు అప్పగించడం జిల్లాలో పాలనా దుస్థితికి అద్దం పడుతోంది. పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరాకూ రెగ్యూలర్ ఎస్ఇలను నియమించకపోవడంతో ఆయా శాఖల్లో పనిచేస్తున్న ఇఇలే దిక్కయ్యారు. వికలాంగులశాఖ ఎడి పోస్టు ఖాళీగా ఉండటంతో జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా ఆ బాధ్యతలను చూస్తున్నారు. పరిశ్రమలశాఖకు జనరల్ మేనేజర్ పోస్టును నియమించకపోవడంతో పొరుగు జిల్లా జిల్లా మేనేజరే ఇక్కడ వ్యవహారాలను చూడాల్సిన దుస్థితి ఏర్పడింది.

ప్రభుత్వశాఖల్లో అతి కీలకమైన విద్యాశాఖ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మునుపెన్నడూ లేనివిధంగా ఈ సారి ఉపాధ్యాయ దినోత్సవ వేడకలను రెగ్యులర్ డిఇఒ లేకుండానే నిర్వహించుకోవాల్సి వచ్చింది. వేడుకల నిర్వహణ, ఆహ్వానాలు వంటి విషయాల్లో దొర్లిన తప్పిదాలతో డిఇఒ లేని లోటు స్పష్టంగా కనిపించింది. పూర్వపు డిఇఒ తిరుమల చైతన్య జూలై 31న ఉద్యోగ విరమణ చేసిన తర్వాత ఇప్పటి వరకు ప్రభుత్వం రెగ్యులర్ డిఇఒను నియమించకపోవడంతో పాలన పూర్తిగా పడకేసింది. సహాయక సంచాలకులుగా పనిచేస్తున్న రవిబాబుకు కేవలం ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగించడంతో సర్వీస్, ఆర్థిక అంశాలను క్లియర్ చేయలేని పరిస్థితి నెలకొంది. ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, ఇంక్రిమెంట్ వంటి తదితర అంశాలకు సంబంధించిన ఫైళ్లు నిలిచిపోయాయి. వీసాలు, పాస్‌పోర్టులకు నో అబ్జక్షన్ సర్టిఫికేటు (ఎన్ఒసి) కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు నెల రోజులుగా నిరీక్షిస్తున్నారు. పూర్వపు డిఇఒ తిరుమలచైతన్య అత్యుత్సాహంతో సస్పెన్లను, క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న ఎచ్చెర్ల మండలం కుప్పిలి హైస్కూల్ ఉపాధ్యాయుల్లో కొందరికి ఉద్యోగోన్నతులు వచ్చిన పాత వేతనమే వస్తుండటం, కొందరిపై ఇంకా క్రిమినల్ కేసులు కొనసాగుతుండటం వంటి విషయాలను డిఇఒనే పరిష్కరించాల్సి ఉంటుంది. డిఇఒ పోస్టును భర్తీ చేయకపోవడంతో అటు మధ్యాహ్న భోజన కార్మికులు, నైట్ వాచ్‌మెన్‌ల వేతనాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇన్‌ఛార్జి డిఇఒగా ఉన్న రవిబాబుకు ఆర్థిక అంశాల ఫైల్‌పై సంతకం చేసే అవకాశం లేకపోవడంతో రెండు నెలలుగా కార్మికులకు గౌరవ వేతనం అందని పరిస్థితి నెలకొంది. జూలై, ఆగస్టుకు సంబంధించి 2,671 మందికి సుమారు 3.21 కోట్లు చెల్లించాల్సి ఉంది. జిల్లాలోని వివిధ పాఠశాల్లో పనిచేస్తున్న నైట్ వాచ్‌మెన్‌లకూ రెండు నెలలుగా జీతాలు ఆగిపోయాయి. వీటితో పాటు అతి ముఖ్యమైన పాఠశాలలపై పర్యవేక్షణ లేక జిల్లా విద్యావ్యవస్థ చతికిల బడిపోయింది.

జిల్లాకు పెద్ద దిక్కుగా ఉన్న వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కేవలం టెక్కలి నియోజకవర్గంలోని ఖాళీలు, నియామకాలపైనే దృష్టి పెడుతున్నారు తప్ప కూటమి ప్రభుత్వం ఏర్పడిన నుంచి జిల్లాను, జిల్లా పాలనా వ్యవహారాలను పట్టించుకోవడం లేదనే విమర్శలను మూటగట్టుకుంటున్నారు. అటు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉన్న గాదె శ్రీనివాసులు నాయుడు జిల్లా విద్యాశాఖను పట్టించుకున్న పాపాన పోలేదు. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరిస్తాను, విద్యారంగం అభివృద్ధికి కృషి చేస్తానంటూ సమావేశాల్లో ప్రసంగాలతో ఊదరగొట్టే ఆయన ఎన్నికయిన తర్వాత పూర్తిగా ముఖం చాటేశారు. దీంతో ఉపాధ్యాయ సంఘాలే ఒక ఉమ్మడి వేదికగా ఏర్పడి విద్యా రంగ సమస్యలతో పాటు డిఇఒ నియామకం, సర్వీసులో అవకతవకలకు పాల్పడిన పూర్వ డిఇఒ తిరుమల చైతన్యపై చర్యలు, ఇతర ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటానికి మరోసారి సిద్ధమవుతున్నారు.

సిఐటియు మహాసభలు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న తేజేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

అక్టోబర్ 4, 5 తేదీల్లో సోంపేటలో జరగనున్న సిఐటియు జిల్లా 12వ మహాసభలు జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్. అమ్మన్నా యుడు, పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. జిల్లా సిఐటియు కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ మహాసభల సందర్భంగా అక్టోబర్ 4న ఉదయం ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతాయని, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్.నర్సింగరావు హాజరవుతారన్నారు. అధిక సంఖ్యలో ఉద్యోగులు, కార్మికులు, అంగన్వాడీ, ఆశ, ఎండిఎం వంట కార్మికులు, స్కీవర్కర్లు, శ్రామిక మహిళలు, అసంఘటిత రంగ కార్మికులు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ధరల పెరుగుదలకు అనుగుణంగా కార్మికుల కనీస వేతనం నెలకు రూ.26 వేలు అమలు చేయాలని, కనీస పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులను, అంగన్వాడీ, ఆశ తదితర స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలని, అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం తదితర స్కీ వర్కర్స్‌కు కనీస వేతనాలు ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా మహాసభలు సెప్టెంబరు 14న పాతపట్నంలో, ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలు సెప్టెంబరు 14న శ్రీకాకుళంలో, మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికుల యూనియన్ జిల్లా మహాసభలు 24న శ్రీకాకుళంలో జరుగుతాయని జయప్రదం చేయాలని కోరారు. ఉచిత బస్సు పథకం వలన ఉపాధి నష్టపోయిన ఆటో, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు భృతి కల్పించి వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ సెప్టెంబరు 11న శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయం వద్ద, టెక్కలి, పలాస ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు. జిల్లాలో శ్యాంపిస్టన్స్ ప్లాంట్-2, డా.రెడ్డీస్ లేబొరేటరీస్ పరిశ్రమల కార్మికుల చార్టర్ ఆఫ్ డిమాండ్లు పరిష్కరించి వేతన ఒప్పందాలు చేయాలని, అక్రమంగా నిలుపుదల చేసిన కార్మిక నాయకులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విఆర్‌ఎలకు కనీస టైం స్కేల్ అమలు చేయాలని, రాత్రి కాపలా డ్యూటీలు రద్దు చేయాలని, మందస జీడి పరిశ్రమలు తెరిపించి కార్మికులకు ఉపాధి కాపాడాలన్నారు. భవన నిర్మాణ కార్మికులు, జట్టు, ముఠా కళాసీలు, ఆటో, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లు, అసంఘటిత కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పని భద్రత, గుర్తింపు కార్డులు, పిఎఫ్, ఇఎస్ఐ, ప్రమాద బీమా, పెన్షన్ పథకాలతో కూడిన సమగ్ర చట్టం చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు కె.నాగమణి, ఎస్.లక్ష్మీనారాయణ, ఎన్.గణపతి, హనుమంతు ఈశ్వరరావు, ఎన్.వి.రమణ, ఆర్.ప్రకాశరావు, బి.ఉత్తర, పి.లతాదేవి, కె.సుశీల, కె.చంద్రశేఖర్, వై.చలపతిరావు, ఆర్.సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులను సక్రమంగా అందించాలి


ఆమదాలవలస : రికార్డులు పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో రైతులకు ఎరువులను సక్రమంగా అందించాలని అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ వ్యవసాయాధికారి మెట్ట మోహనరావును ఆదేశించారు. శనివారం మండలంలోని దూసి రైతుసేవా కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎరువులకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులకు శాస్త్రీయ పద్ధతిలో ఎరువులను సరఫరా చేయాలన్నారు. మూడు విడతలకు కలిపి ఎకరాకు 75 కేజీల చొప్పున రైతులకు ఎరువులను పంపిణీ చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. యూరియాను రెండు విడతలకు కలిపి చెరో పాతిక కేజీలు చొప్పున రైతు సేవా కేంద్రాల ద్వారా మరో పాతిక కేజీలు ప్రైవేటు డీలర్ల ద్వారా రైతులకు ఇప్పించాలన్నారు. గతంలో ప్రస్తుతం ఎరువుల సరఫరా పంపిణీని క్షుణ్ణంగా పరిశీలించారు. ఎరువుల పంపిణీ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. యూరియా పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు.

యూరియా షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

పట్టణంలో శనివారం సాయంత్రం విజిలెన్స్ సిఐ సతీష్ ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని శివ బాలాజీ, మన గ్రోమోర్, వైశ్యరాజు శ్రీరామరాజు ఎరువుల దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు. స్టాకును, స్టాకు రిజిస్టర్‌తో సరిపోల్చి సక్రమంగా ఉన్నట్లు గుర్తించారు. పరిశీలనలో తహశీల్దార్ ఎస్. రాం బాబు, వ్యవసాయ, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీకి ప్రభుత్వం కట్టుబడి ఉంది

రణస్థలం రూరల్: ఎరువుల పంపిణీకి ప్రభుత్వం కట్టుబడి ఉందని సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. మండలంలోని వేల్పురాయి సచివాలయంలో ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరువుల పంపిణీ ప్రక్రియపై స్థానిక రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులందరికి సకాలంలో ఎరువులు అందుతాయన్నారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఎరువులు వాడాలన్నారు. పంట నమోదు పక్కాగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సనపల కిరణ్ కుమార్, ఎంపిడిఒ ఈశ్వరరావు, ఎడి వడ్డాది శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి డి.విజయ భాస్కర్, స్థానిక సర్పంచ్ బాలి శ్రీను, అధికారులు, రైతులు పాల్గొన్నారు.


రణస్థలం రూరల్: ఎరువుల పంపిణీని పరిశీలిస్తున్న జెసి


మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

పిల్లల రక్షణలో నిర్లక్ష్యం వద్దు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి- శ్రీకాకుళం లీగల్

పిల్లలే దేశ భవిష్యత్ అని, వారి రక్షణలో నిర్లక్ష్యం చోటు చేసుకోవద్దని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా స్పష్టం చేశారు. జువెనైల్ జస్టిస్-పిల్లల రక్షణ చట్టాల అమలు విషయంలో ప్రతిశాఖా బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన జిల్లా కోర్టు భవనంలో జువెనైల్ జస్టిస్-పిల్లల రక్షణ చట్టాలపై శనివారం జిల్లాస్థాయి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులపై జరుగుతున్న దుర్వినియోగాన్ని అరికట్టడంలో కుటుంబం, పాఠశాల, సమాజం కీలక పాత్ర పోషించాన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, చైల్డ్‌లైన్ సేవలు మరింత చురుకుగా పనిచేస్తే పిల్లల భద్రత బలపడుతుందని సూచించారు. సమావేశంలో జువెనైల్ జస్టిస్ బోర్డు, పోక్సో కోర్టు న్యాయమూర్తి, సామాజిక సంక్షేమశాఖ, ఆరోగ్యశాఖ, పోలీసుశాఖ ప్రతినిధులు పాల్గొని సమస్యలను చర్చించారు. చట్టాల అమలులో ఎదురవుతున్న సవాళ్లను గుర్తించి, సంబంధిత శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఒకటో అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు, కార్యదర్శి కె.హరిబాబు, ప్రిన్సిపాల్ మెజిస్ట్రేట్ కె.ఎం. జమ్రుత్ బేగం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ యు.శ్రీలక్ష్మి, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అండ్ ఎంపవర్మెంట్ ఆఫీసర్, మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్, సోషల్ వెల్ఫేర్ శాఖ అధికారులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న బాధితులు

పోస్టల్ బాధితుల ఆందోళన

ఇచ్ఛాపురం: తపాలాశాఖపై ఎంతో నమ్మకంతో కష్టపడి దాచుకున్న డబ్బులను త్వరగా చెల్లించాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పోస్టాఫీసు వద్ద బాధితులు శనివారం ఆందోళన చేపట్టారు. తపాలాశాఖలో భారీ స్థాయిలో లబ్ధిదారులు డిపాజిట్ సొమ్ము కాజేశారని, అడిగితే ఇప్పటి వరకు బాధితులకు సరైన భరోసా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భారీ అవినీతిలో జిల్లాస్థాయి అధికారుల హస్తం కూడా ఉందని బాధితులు ఆరోపిస్తున్నారు. 15 రోజుల్లో డిపాజిట్లు చెల్లిస్తామని హామీనిచ్చారని, రెండు నెలలు అవుతున్నా పోస్టల్ అధికారులు స్పందించడం లేదని అన్నారు. పిల్లల చదువు, పెళ్లి కోసం దాచుకున్న డబ్బులను సిబ్బందే అవినీతికి పాల్పడడం వల్ల పోస్టల్‌పై నమ్మకం పోయిందని అన్నారు. పోస్టల్ అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని, లేకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాధితులు చాట్ల లోహిదాసు, హైమావతి, చిరంజీవి, ఇసురు బాలరాజు, శరణ్యమాధురి పాల్గొన్నారు. జనసేన నాయకులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దాసరి శేఖర్, శ్యామ్‌సుందర్, కలియా సంఘీభావం తెలిపారు.

పారిశుధ్య పనులు పరిశీలన

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ ప్రత్యేక పారిశుధ్యం పనులు డిఎల్‌పిఒలు ఐ.వి.రమణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పటినుంచో కాలువలో మురుగు కూరికిపోవడంతో ప్రత్యేక డ్రైవర్ నిదర్శిస్తున్నట్లు తెలిపారు. నాలుగు రోజులుగా కాలువలోని మట్టిని తీసి అడుగుభాగం వరకు సిల్ట్ తొలగించి కాలువలను శుభ్రం చేశారు. బైర వీధిలో రెండు రోజుల్లో పూర్తి కావాల్సిన పనులు నాలుగు రోజులుగా సాగుతూ ప్రత్యేక పారిశుధ్య కార్మికులు నిరాటంకంగా తమ పనులను కొనసాగిస్తున్నారు. ఈ ప్రత్యేక పారిశుధ్య పనులు టెక్కలిలోని అన్ని వీధుల్లో పరిశుభ్రం చేస్తామని పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి మీడియా వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ కె.సింహాద్రి, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎ.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ సూర ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

వినుత్నకు అభినందనలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఇటీవల నిర్వహించిన 9వ స్టేట్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్ షిప్‌లో ఆర్‌జియుకెటి (ట్రిపుల్‌ఐటి)లో పియుసి ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్.వినుత్న శ్రీకాకుళం జిల్లా తరుపున పాల్గొని తృతీయ స్థానంలో నిలిచి త్వరలో జాతీయస్థాయిలో జరగబోయే పోటీలకు అర్హత సాధించడంతో కళాశాల డైరెక్టర్ కె.వి.జి.డి.బాలాజీ అభినందించి త్వరలో జరగబోయే పోటీల్లో కూడా ఉత్తమ ప్రదర్శన కనబర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎఒ డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, వెల్ఫేర్ డీన్ డాక్టర్ రవి గేదెల, ఇన్‌ఛార్జి సాగర్, టి.దిలీప్ కుమార్, కృష్ణంరాజు పాల్గొన్నారు.


పద్మను సన్మానిస్తున్న రాజాం ఎమ్మెల్యే మురళీమోహన్

ఎఎంసి చైర్మన్‌కు అభినందనలు

ప్రజాశక్తి- లావేరు

ఎచ్చెర్ల ఎఎంసి చైర్మన్‌గా నియామకమైన నిడిగంట్ల పద్మ శనివారం విజయనగరం జిల్లా రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌ను రాజాం క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మురళీమోహన్ ఎఎంసి చైర్మన్ నిడుగంట్ల పద్మ దంపతులను దుశ్శాలువ, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి వారికి పార్టీ గుర్తిస్తుందనడానికి పద్మ నిదర్శనం అన్నారు. బాధ్యతగా పని చేసి రైతులకు సేవలందించాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి ఎన్.త్రినాథ్, లావేరు మాజీ సర్పంచ్ మాకన శంకరరావు, టిడిపి నాయకులు లంకలపల్లి శ్రీనువాసరావు, ఉప్పు జీవానందం, ఇజ్జు సత్తిబాబు, రాజు తదితరులున్నారు.


మాట్లాడుతున్న జడ్జి జ్యోత్స్న

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- పొందూరు

బాలికలు తమ హక్కుల పరిరక్షణకు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. మండలం కేంద్రంలో బాలికల బిసి వసతి గృహంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలు, పోక్సో చట్టం తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి.రామ్మోహన రావు, ఎం.రాము, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్ష

పలాస : ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు కార్మికులను ఆదుకోవాలని బిసి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు కార్మికులు చేపట్టిన దీక్ష శనివారంతో 24వ రోజుకు చేరింది. ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు కార్మికులకు బిసి సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. అనంతరం రాష్ట్ర బిసి సంఘం ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావు మాట్లాడుతూ ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు కార్మికులను అర్ధాంతరంగా తొలగించడం దారుణమన్నారు. తొలగించడం వల్ల వారితో పాటు వాళ్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వంకల షణ్ముఖరావు, యాదవ్ ఇరోతు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ లబ్ధిదారులను గౌరవించాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రేషన్ లబ్ధిదారులతో డీలర్లు కుటుంబ సభ్యుల్లా గౌరవంగా మాట్లాడాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లాలోని రేషన్, గ్యాస్ డీలర్లతో జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ షాపులకు వచ్చే లబ్ధిదారులతో సానుకూల దృక్పథంతో, కుటుంబ సభ్యుల్లా మాట్లాడాలన్నారు. సహనంతో ఉండాలన్నారు. ప్రభుత్వ ఆమోదం తెలిపిన ధరలకే గ్యాస్ సిలిండర్ డెలివరీ చేయాలన్నారు. ఐవిఆర్ఎస్ కాల్స్‌లో ప్రజల అభిప్రాయం తీసుకుంటామని చెప్పారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్స్ డబ్బులు వసూలు చేస్తున్నారని, అలాంటి గ్యాస్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ దుకాణాల్లో సరుకులను పంపిణీ చేయాలన్నారు. తెలియజేసిన సమయాల్లో లబ్ధిదారులు తమకు అనుకూలమైన సమయానికి, ఎలాంటి ఇబ్బంది లేకుండా రేషన్ తీసు కోవచ్చునని, 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు, వికలాంగులకు డీలర్ల ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. వీటిపై సివిల్ సప్లయ్ డిటి మోనిటరింగ్ చేయాలని ఆదేశించారు. పోస్టర్‌లో ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి లబ్ధిదారులు రేషన్‌పై అభిప్రాయం తెలపవచ్చన్నారు. సమస్యలతో లబ్ధిదారులు, వినియోగ దారులు డీలర్ల దగ్గరకు వచ్చేటప్పుడు ఆత్మీయంగా సొంత బంధువుల్లాగా లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్ నాణ్యతపై సివిల్ సప్లై డిటిలు ఎప్పటికప్పుడు రేషన్ షాపుల్లో తనిఖీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ వేణుగోపాల్, జిల్లా పౌర సరఫరాల అధికారి సూర్యప్రకాష్, సిఎస్‌డిటిలు, రేషన్ డీలర్లు, గ్యాస్ ఏజెన్సీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పరిశ్రమలను అడ్డుకుంటే అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

రాష్ట్రంలో ఏ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా, నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి లభించాలన్నా పరిశ్రమల స్థాపనతోనే సాధ్యపడుతుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శనివారం మండలంలోని వెన్నెలవలస గిరిజన ఆశ్రమ పాఠశాలలో రూ.4.36 కోట్లతో చేపట్టనున్న అదనపు భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అలాగే వెన్నెల వలస జవహర్ నవోదయ విద్యాలయంలో నూతనంగా నిర్మించిన అటల్ టింకరింగ్ ల్యాబ్ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.12 కోట్లతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ అభివృద్ధి పథక నిధులతో సరుబుజ్జిలి మండల కేంద్రంలో చేపట్టనున్న రోడ్ల విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు మండల కేంద్రం ఇరుకైన రహదారులతో వాహనాల రాకపోకలకు ఎంతో ఇబ్బందులు పడేవారని వాటిని నివారించడానికి రూ.12 కోట్లతో రోడ్ల విస్తరణ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అలాగే ఈ ప్రాంతంలో సుమారు రూ.30 వేల కోట్లతో 3200 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్‌ప్లాంట్ నిర్మించడానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో గిరిజన శాఖ ఇఇ రమాదేవి, రోడ్లు భవనాల శాఖ ఎస్ఇ సత్యనారాయణ, ఇఇ తిరుపతిరావు, జెఇ ఆంజనేయ నాయక్, ఎంపిడిఒ ఎం.పావని, తహశీల్దార్ ఎల్.మధుసూదన్, డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, టిడిపి నాయకులు కిల్లి సిద్ధార్థ, తాడేల వెంకటరమణ, పల్లి సురేష్, టిడిపి మండల అధ్యక్షులు అంబల్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: పురపాలక సంఘంలో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పని చేస్తున్నానని ఎమ్మెల్యే రవికుమార్ అన్నారు. పట్టణంలో 1వ వార్డు తిమ్మాపురంలో బిపిఎస్ ఎల్‌ఆర్ఎస్ నిధులు రూ.35.55 లక్షలతో 1, 22, 23వ వార్డుల్లో చేపట్టనున్న సిసి రహదారులు, కాలువల నిర్మాణాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, టిడిపి నాయకులు మొదలవలస రమేష్, టిడిపి మండల అధ్యక్షుడు నూక రాజు, రాష్ట్ర మెడికల్ బోర్డు మెంబర్ చాపర సుధాకర్, కూటమి నాయకులు పేడాడ రామ్మోహనరావు, సూరపు నాయుడు, కణితి విజయలక్ష్మి, బోర గోవిందరావు, మురళీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

9న 'అన్నదాత పోరు'

మాజీ మంత్రి అప్పలరాజు



పలాస : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో రైతాంగానికి ఇబ్బందులు పెడుతూ రైతులపై అవలంబిస్తున్న తీరుకు నిరసిస్తూ ఈ నెల 9న తలపెట్టిన అన్నదాత పోరు, రైతన్నకు బాసట కార్యక్రమాన్ని విజయవతం చేయాలని మాజీ మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు పిలుపునిచ్చారు. కాశీబుగ్గ వైసిపి కార్యాలయంలో అన్నదాత పోరుబాట పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతాంగానికి అవసరమైన ఎరువులు తక్షణమే పంపిణీ చేయాలన్నారు. బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఎరువులు పక్కదారి పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉచిత పంటల బీమా పున:రుద్ధించాలన్నారు. వర్షాలు కారణంగా దెబ్బతిన్న ప్రాంతాల రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కొత్తూరు : ఎరువులు బ్లాక్ మార్కెట్‌పై ఈ నెల 9న నిర్వహించనున్న అన్నదాత పోర్ పోస్టర్‌ను వైసిపి మమండల అధ్యక్షులు గండివలస ఆనందరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ కోరారు. ఈ మేరకు పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి సవర రమేష్, ఎంపిటిసి లక్ష్మీనారాయణ, పోలయ్య, మాజీ సర్పంచ్ డి.అప్పన్న, బి.నగేష్, ఎం.శంకరరావు పాల్గొన్నారు.

పలుచోట్ల అన్నదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం పట్టణం, ఎచ్చెర్ల, సంత సీతారాం పురం గ్రామాల్లో గణపతి నవరాత్రులు సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్ఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అధికసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: వినాయక నవరాత్రుల్లో భాగంగా మండలంలోని బంటుపల్లిలో ఏర్పాటు చేసిన వర సిద్ది వినాయక మండపాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, స్థానిక సర్పంచ్ ఎన్.రజని సందర్శించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొని శోభయాత్ర ప్రారంభిం చారు. అదే విధంగా మండలంలోని గరికిపాలెం, కోష్ట, కమ్మ సిగడాం తదితర గ్రామాల్లో అన్న సమారాధనలు జరిగాయి.

సోంపేట : మండలంలోని సోంపేట టౌన్, జింకిభద్ర గ్రామాల్లో వినాయ ఉత్సవాలు సందర్భంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి డాక్టర్ నిమ్మన దాస్ పాల్గొని ఒడ్డించారు. కార్యక్రమంలో సుంకిడి ఎంపిటిసి నిమ్మన లీలారాణి, సర్పంచ్ తామాడ పద్మావతి శేఖర్, పెద్దకోట అనంత్, ఎన్ని అజయ్, ఎ.జగదీష్, బత్తుల శంకరరావు, సల్ల గున్నారావు, సల్ల వాసు, కొల్ల సీతయ్య, కె.జగదీష్, రాజాం లక్ష్మణరావు, ఈరోతు రాజు, చంద్రశేఖర్, తామాడ దిలీప్, బత్తుల పురుషోత్తం పాల్గొన్నారు.


రణస్థలం రూరల్ : అన్నదాన కార్యక్రమంలో వడ్డిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు


శ్రీకాకుళం సిటీ : సంత సీతారాంపురంలో నిర్వహిస్తున్న అన్నదానం


సోంపేట : అన్నదానంలో పాల్గొన్న ఎంపిపి దాస్

జిల్లేడు ద్రావణంతో పొటాష్ లోపం నివారణ

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని గొర్లపాడు యూనిట్ పరిధిలోని శిలగాం, ఖాజూరు గ్రామాల్లో రైతులకు జిల్లేడు ద్రావణం తయారీ, వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పంటల్లో ప్రస్తుతం అధికంగా కనిపిస్తున్న పొటాష్ లోపాన్ని అధిగమించే ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా జిల్లేడు ద్రావణం తయారీ చేపట్టారు. శిలగాంకు చెందిన రైతు మల్లార్పు జయమ్మ ఆధ్వర్యాన ఖాజూరుకు చెందిన పొందిర్ల వెంకటరావు సహకారంతో, గ్రామ రైతుల సమక్షంలో సామూహికంగా 300 లీటర్ల జిల్లేడు ద్రావణం తయారీ చేశారు. ఈ ద్రావణం 3 రోజులకు సిద్ధమవుతుందని, 10 లీటర్ల జిల్లేడు ద్రావణాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే పంటలో పొటాష్ లోపం, సూక్ష్మ పోషకాల లోపం తగ్గడంతో పాటు రసం పీల్చే పురుగుల నివారణకు కూడా ఉపయోగపడుతుందని డిఎంఎంటి తులాశయ్య వివరించారు. కార్యక్రమంలో ఐసిఆర్‌సిలు సంతోషి, స్వాతి, జయ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు సందర్శన

లావేరు: మండలం బెజ్జిపురం గ్రామంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం బృందం సభ్యులు సందర్శించారు. బెజ్జిపురం యూత్‌క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయం, సార్వత్రిక సూత్రాలు, చక్రం సందర్శించారు. చక్రం ఆవశ్యకతను ఎన్ఎఫ్ఎ గోవింద రెడ్డి వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేయటానికి అవసరమైన బీజామృతం తయారీ, ద్రవ జీవామృతం తయారీ, ఘనజీవామృతం తయారీ, జిల్లేడు ద్రావణం తయారీ, నీమాస్త్రం తయారీ, విసముసిడి కషాయం తయారీ, ఉపయోగించే విధానాన్ని బృంద సభ్యులకు రీజనల్ టెక్నికల్ అధికారులు హేమసుందర్ వివరించారు. రైతులు సాగుచేసిన నవధాన్యాల పొలాలను పరిశీలించి రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ డిపిఎం ధనుంజయ్, ఎన్ఆర్ఒ తరుణ్ ఆదిత్య, శ్రీను, ఎన్ఎఫ్ఎఐసి టి.శివకృష్ణ, మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ, రాంబాబు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


ద్రావణం తయారు చేస్తున్న రైతులు

డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పట్టణంలోని వాంబే కాలనీలో స్థానికంగా నివసిస్తున్న దన్నాన రాజేష్ (33) డ్రైనేజ్‌లో పడి మృతి చెందాడు. పొరపాటున శుక్రవారం రాత్రి పడి ఉంటాడని భావిస్తున్నారు. స్థానికులు శనివారం ఉదయం మురికి కాలువలో రాజేష్ మృతి చెంది ఉండటాన్ని గమనించి కుటుంబ సభ్యులకు తెలియ జేయగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరాలు కార్పొరేషన్ డైరెక్టర్‌గా కన్నన్నాయుడు

ప్రజాశక్తి- బూర్జ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నగరాలు కార్పొరేషన్‌లో మండలం చీడివలసకు చెందిన టిడిపి నాయకులు పిల్లా కన్నన్నాయుడుకు చోటు దక్కింది. నగరాలు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు రుణ పడి ఉంటానన్నారు. ఈ అవకాశంతో మరింత బాధ్యత పెరిగిందని, నగరాల ఉన్నతికి కృషి చేస్తానన్నారు.

జాబ్‌మేళాలో 219 మంది ఎంపిక

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం మండల కేంద్రంలో శ్రీసాయి డిగ్రీ కళాశాల ఎపిఎస్ఎస్‌డిసి ఆధ్వర్యంలో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మీసాల రమేష్, ఎపిఎస్ఎస్‌డిసి మేనేజర్ ఉరిటి సాయికుమార్, వివిధ పారిశ్రామిక రంగాల నుంచి వచ్చిన పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈజాబ్ మేళాకు వివిధ ప్రాంతాల నుంచి 352 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో వివిధ రంగాల వారీగా 219 మంది అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ జాబ్ మేళాలో ఆల్ హెండ్స్ గ్లోబల్ ప్రేవేటు లిమిటెడ్, ఎస్‌బిఐ కార్డు, హెట్రోఫార్మా, అరీవ్క్స్ ల్యాబ్ ప్రేవేట్ లిమిటెడ్, లాట్ మొబైల్స్, టాటా ఎలక్ట్రానిక్స్, యాక్సిస్ బ్యాంక్, ఎంఆర్ఎఫ్ టైర్స్ తదితర పరిశ్రమల ప్రతి నిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హత గల అభ్యర్థు లను ఎంపిక చేసి నియామకపత్రాలు అందజేశారు.



మాట్లాడుతున్న వెంకన్న చౌదరి

చిన్నతరహా పరిశ్రమల వృద్ధికి 'లఘు ఉద్యోగ్ భారత్' తోడ్పాటు

పలాస: చిన్నతరహా పరిశ్రమల వృద్ధికి 'లఘు ఉద్యోగ్ భారత్' అందిస్తున్న తోడ్పాటు ఎనలేనిదని లఘు ఉద్యోగ్ భారత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మార్పు వెంకటేష్, జాతీయ కార్యవర్గ సభ్యుడు కృష్ణబాలాజీ, రాష్ట్ర సెక్రెటరీ రాజశేఖర్, విశాఖ జిల్లా సెక్రెటరీ రాజేంద్ర, టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి అన్నారు. పలాస జీడి వ్యాపారుల సంఘం కార్యాలయంలో శనివారం జీడి వ్యాపారులు, రైస్ మిల్లు వ్యాపారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న చిన్న తరహా పరిశ్రమల అభ్యున్నతికి పనిచేసే ఏకైక సంస్థ 'లఘు ఉద్యోగ్ భారత్' అని కొనియాడారు. మైక్రో అండ్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ కోసం 'లఘు ఉద్యోగ్ భారత్' పనిచేస్తున్నట్లు వెల్లడించారు. మ్యానుఫ్యాక్చరర్స్‌కి అధిక ప్రాధాన్యత ఇస్తుంటామని అన్నారు. కార్యక్రమంలో పిసిఎంఎ అధ్యక్షులు మల్లా శ్రీను, టంకాల రవి శంకర్ గుప్తా, మల్లా సంతోష్, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.


సన్మానం చేసిన ఉపాధ్యాయులతో ట్రస్ట్ ప్రతినిధులు

ఉపాధ్యాయులే మార్గదర్శకులు

శ్రీకాకుళం సిటీ: ఉపాధ్యాయులే సమాజ ప్రగతికి మార్గదర్శకులని విశ్రాంత ఆర్‌డిఒ, ఆంధ్రప్రదేశ్ విద్య మౌలిక సదుపాయాల కల్పన డైరెక్టర్ పి.ఎం.జె.బాబు అన్నారు. కొంక్యాన గోవిందరాజులు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నగరంలోని విశాఖ -బి కాలనీలోని షిర్డీసాయి మందిరంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాలకు క్రమశిక్షణ, మంచి మార్గంలో నడిపించగలిగే శక్తి, సామర్థ్యాలు ఉపాధ్యాయులకు మాత్రమే ఉంటాయన్నారు. 15 ఏళ్లుగా కొంక్యాన గోవింద రాజులు చారిటబుల్ ట్రస్టు విశిష్టమైన సేవలు అందిస్తుందన్నారు. డిసిసిబి మాజీ చైర్మన్ సింతు సుధాకర్, సామాజికవేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు, ఆరోగ్య విస్తరణాధికారి డాక్టర్ నల్లి రవికుమార్, వాకర్స్ ఇంటర్నేషనల్ సెక్రెటరీ సుగంధం సంజీవరావు, ట్రెజరర్ సి.హెచ్.బసవరాజు, గౌతమ్‌నగర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.జోగినాయుడు, మాట్లాడారు. 42 మంది ఉపాధ్యాయులకు సత్కరించారు.



డ్రోన్ యంత్రాన్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

డ్రోన్ పంపిణీ

ప్రజాశక్తి- జలుమూరు

రైతులను అన్ని విధాల ఆదుకునే విధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందనిఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. మండలంలోని గొటివాడ వెంకటేశ్వర కిసాన్ డ్రోన్ సిహెచ్‌సి గ్రూప్ సభ్యులకు సబ్సిడీపై రైతులకు అందిస్తున్న డ్రోన్ యంత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.9.80 లక్షలతో విలువైన డ్రోన్ యంత్రం కేవలం తక్కువ ధరకే రైతులకు అందించామని అన్నారు. రైతులు గ్రూపులుగా ఏర్పడి సంఘాన్ని ఏర్పాటు చేసుకోగలిగితే ఈ అవకాశం వారికి లభిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వెలమల రాజేంద్ర నాయుడు, పిఎసిఎస్ చైర్మన్లు దుంగ స్వామిబాబు, వెలమల చంద్రభూషణ్, కింజరాపు సత్యనారాయణ, సర్పంచ్‌లు బగ్గు గోవిందరావు, పంచిరెడ్డి రామచంద్రరావు, మొయ్యి శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ ఎడి ఎల్.వెంకటమధు పాల్గొన్నారు.



మెడికల్ షాప్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్‌ఒ మేరీకేథరిన్

అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అనుమతి లేకుండా నడిపే ఆస్పత్రులపై ప్రభుత్వ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ మేరీకేథరిన్ హెచ్చరించారు. మండలంలోని దేవునల్తాడ కూడలిలో ఉన్న శారదాదేవీ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్‌ను శనివారం పరిశీలించారు. ఆర్‌ఎంపి వైద్యులు కె.లక్ష్మణరావు ఆస్పత్రి నడుపుతూ రోగులను మోసం చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో దీంతో ఆమె తనిఖీలు నిర్వహించారు. మెడికల్ షాప్‌కు లైసెన్స్ ఉందని తెలిపారు. మెడికల్ షాప్‌లో హై యాంటిబయాటిక్స్, ఇంజిక్షన్లు ఉన్నట్లు గుర్తించమని తెలిపారు. పెద్దాస్పత్రిలో వివియోగించే డ్రగ్స్ ఇక్కడ లభించడంతో అధికారులు విస్మయానికి గురయ్యారు. మెడికల్ షాప్ పరిసరాల్లో వాడిన సిరంజిలు, ఐవి సెట్లు రోగుల కోసం ఉపయోగించే పరుపులు, ఖాళీ సెలైన్ బాటిళ్లను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. అనంతరం లక్ష్మణరావుపై కేసు నమోదు చేసి ఆస్పత్రిని సీజ్ చేశారు. కార్యక్రమంలో టెక్కలి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ యుగంధర్, గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వినాయకుమార్, ఫార్మాసిస్టు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

క్వాంటం కంప్యూటింగ్‌తో ఒప్పందం

టెక్కలి రూరల్: టెక్కలి ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాల క్యూపిఎఐకు క్వాంటమ్ కంప్యూటింగ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ లక్ష ప్రియదర్శి, ప్రొడక్ట్ లీడర్ ఎం.చంద్రమళితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. కళాశాలలో ఒప్పంద పత్రాలను శనివారం అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాల అభివృద్ధితో పాటు విద్యార్థుల పురోగతి అనేక లాభాలు చేకూరుతాయని తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, ధ్రువపత్రాల ద్వారా విద్యార్థుకు, సంస్థకు అనేక ఉపయోగాలు కలుగుతాయని వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, క్యూపిఎఐ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీప్రియదర్శి కార్యదర్శి ఎల్.ఎల్‌నాయుడు పాల్గొన్నారు.

'యూరియా కొరతకు అధికారులదే బాధ్యత'

పొందూరు: ఎటువంటి ముందుస్తు ప్రణాళికలు లేకుండా వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలనే రైతులకు యూరియా కష్టాలు వచ్చాయని తోలాపి మాజీ సర్పంచ్, మాజీ వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు పొన్నాడ రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారుల నిర్లక్ష్యవైఖరితో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, తోలాపిలో సుమారు 700 ఎకరాలకుపైగా వరి సాగుచేసే రైతులు ఉండగా, వారికి సుమారు 2 వేల యూరియా బస్తాలు అవసరం కాగా ఇప్పటివరకూ కనీసం 500 బస్తాలను కూడా అందించలేదన్నారు. అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి రైతులకు అవసరమైన యూరియాను అందించాలని కోరారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న అరుణ్‌కుమార్

ఎమ్మెల్యేను కలిసిన అరుణ్‌కుమార్

నరసన్నపేట: ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని ఐటి ప్రతినిధి అరుణ్‌కుమార్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు వీలుగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సూక్ష్మ మధ్య తరహా పరిశ్రమల విస్తరణకు రూపొందించిన ర్యాంపు పథకం ద్వారా చేపడతామని తెలిపారు. ట్రెడ్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యాన పరిశ్రమల వ్యవస్థాపకత వృత్తి నైపుణ్యాపై నరసన్నపేటలో పద్మావతి డిగ్రీ కళాశాల, ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న భావముల్లో నెల రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు ఉన్నవారు అర్హులని అన్నారు. తెల్లరేషన్ కార్డు, తరగతి ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, పేర్ల నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9885117831 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

కళాకారుడు గురుమూర్తికి అవార్డు

రణస్థలం: మండల కేంద్రానికి చెందిన ప్రముఖ కళాకారుడు బోనం గురుమూర్తి మండలి బుద్ధ ప్రసాద్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. విజయవాడ శ్రీ కౌతా పూర్ణానంద కళావేదికలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఏకపాత్రాభినయ పరిషత్ పోటీలు నిర్వహించారు. 80 మంది కళాకారులు పరిషత్ పోటీల్లో పాల్గొనగా భక్తకవి నతి కీరుడుగా, కుష్టు వ్యాధిగ్రస్తుడిగా నటించి అవార్డుని అందుకున్నారు. ఈ పోటీలకు పిన్నింటి సాయి సురేష్ ఆర్థిక ప్రోత్సాహంతో విజయవాడ వెళ్లి ఈ పోటీల్లో పాల్గొని అవార్డు అందుకోవడం సాయి సురేష్‌కి రుణపడి ఉంటానని గురుమూర్తి తెలిపారు.

అధ్యాపకునికి డాక్టరేట్

పొందూరు: కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భౌతికశాస్త్రం అధ్యాపకునిగా పనిచేస్తున్న సోపింటి రమేష్ భౌతికశాస్త్రంలో డాక్టరేట్‌ను అందుకున్నారు. నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టర్ బి.వి.రాఘవయ్య పర్యవేక్షణలో గ్లాస్ సైన్స్ అంశంపై పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ అవార్డుకు ఎంపికయ్యారు. యూనివర్సిటీ ప్రొఫెసర్ లింగరాజు చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. డివిఇఒ సురేష్ కుమార్, ప్రిన్సిపాల్ సునీత, పైడి పద్మావతి, అధ్యాపకులు వెంకటేశ్వరరావు, శివరాం ప్రసాద్, అన్నపూర్ణారావు, బాలకృష్ణ అభినందించారు.

సంకల్పంపై అవగాహన

నరసన్నపేట : అంగన్వాడీ కేంద్రాల్లో వారం రోజుల పాటు నిర్వహిస్తున్న సంకల్ప అనే అంశంపై అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ తెలిపారు. మండలంలోని పెద్దపేట, బండివీధి, ముద్దాడవీధి, అంగన్వాడీల్లో శనివారం అవగాహన కల్పించారు. వంట గది పరిసరాలు శుభ్రంగా ఉంచాలన్నారు. సక్రమంగా పౌష్టికాహారాన్ని పంపిణీ చేయాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు త్రిపుర సుందరి బాలమణి, గొల్లంగి పుణ్యవతి, సతివాడ సంధ్యారాణి పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

నరసన్నపేట: మండలంలో దూకలపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కె.వి.రమణయ్య ఆధ్వర్యాన శనివారం ఉపాధ్యాయులు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. అలాగే స్థానిక ఇంజినీర్ ఉమామహేశ్వరరావు విద్యార్థులకు శులభంగా ఇంగ్లీష్ నేర్చుకునేందుకు ఉపయోగపడే పుస్తకాలు పంపిణీ చేశారు. సర్పంచ్ అల్లు అసిరినాయిడు, సత్యవరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వకుళాదేవి, ప్రధానోపాధ్యాయుడు కె.వి.రమణయ్య, ఉపాధ్యాయులు పంగ అప్పలనాయుడు, కె.ప్రభావతి, గ్రామ పెద్దలు అల్లు అప్పన్న, చంద్రరావు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు పిట్ట గంగన్న జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలు వేశారు. అనంతరం 22 మంది ఉపాధ్యాయులను సన్మానించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

నందిగాం : ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పెద్దతామరపల్లి ఆంగ్లో పాధ్యయులు నారాయణమూర్తి, ప్రధానోపాధ్యాయులు నాగ మునిష్‌లను సన్మానించారు. ఎంఇఒ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులు రెడ్డి సూరిబాబు, పొన్నాడ చంద్రశేఖర్, బొడ్డ ఈశ్వరిలను ఎంఇఒలు జె.చిన్నవాడు, డి. అర్జునుడు సన్మానించారు. అలాగే ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులనూ



వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న సర్పంచ్ గిరిజ

సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు గణపతిరావు, పాపారావు, శంకర్, శివప్రసాద్, ఫాల్గుణరావు, కె.వి.రమణ, వెంకటేష్, చందు, షణ్ముఖరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కాగాపు తేజేశ్వరకుమార్‌ని గ్రామస్తులు సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు వి.సరోజని అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఇఒ కె.అప్పారావు, అలాగే రాజము ప్రమీలను కూడా సన్మానించారు. కార్యరకమంలో బిర్లంగి సర్పంచ్ ప్రతినిది డి.సూర్యనారాయణ, విద్యాకమిటీ చైర్మన్ పి.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట: పాలాకి మండలం నుంచి ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయులుగా సుసరాం హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న ఎం.శ్యామలరావు, కోడూరు హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న బాడాన రాజు మాష్టర్‌లకు ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు వచ్చాయి. ఈ సందర్భంగ రాజు స్వగృహంలో శనివారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సోంపేట : డిఎస్‌సి ఫలితాల్లో ఉపాధ్యాయునిగా ఎంపికైన సుంకిడికు చెందిన కోమటి వాసుదేవరావు, బతకల వంశీకృష్ణ, ఇప్పిటి శిరీషలను శనివారం గ్రామస్తులు సన్మానించి, అభినందించారు. మీరు సాధించిన విజయం ఎందరో యువకులకు ఆదర్శనీయమని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద బతకల మోహనరావు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు...

వజ్రపుకొత్తూరు : ఎక్కడ పనిచేసినా ఉపాధ్యాయులు మంచిపేరు తెచ్చుకోవాలని సర్పంచ్ గూడ గిరిజ ఈశ్వరరావు అన్నారు. మండలంలోని గరుడభద్ర మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎనిమిదేళ్లుగా పనిచేసి బదిలీపై వేరే పాఠశాలకు వెళ్లిన పి.శ్రీనివాసరావు, ఐ.రమేష్‌కుమార్‌లను శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఇద్దరు ఉపాధ్యాయులు చాలా కఠోరమైన దీక్షతో పనిచేసి అనేక మంది విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దారని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భారతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు సుజాత, అంగన్వాడీ కార్యకర్త సరస్వతి, కె.మోహనరావు, వై.జోగారావు, టి.ప్రవీణ్, ఎ.ధనరాజ్, టి.ప్రకాష్, టి.ఎల్. నారాయణ పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రాలు పరిశీలిస్తున్న అధికారులు

పరీక్షా కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఆదివారం జరగనున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పరీక్షల ఏర్పాట్లను శనివారం ఎపిఎస్‌ఎస్‌సి సభ్యుడు ఎన్.సోనీ వుడ్ పరిశీలించారు. శ్రీకాకుళం నగర పరిధిలోని ముఖ్యమైన మూడు కేంద్రాలైన శ్రీ చైతన్య ఇఎమ్ స్కూల్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఫర్ వుమెన్, చిలకపాలెం శ్రీ శివాని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థుల కోసం చేసిన ఏర్పాట్లను ఆయన సమీక్షించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

నేత్రదానంపై అవగాహన

ప్రజాశక్తి- సంతబొమ్మాళి


జాతీయ 40వ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన టెక్కలి డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ మేరీ కేథరిన్ మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు గ్రామాల సందర్శనల్లో నేత్రదానంపై ఉన్న అపోహలను తొలగించాలని సూచించారు. మరణానంతరం నేత్రదానానికి ప్రజలను ప్రోత్సహించి అవగాహన కల్పించాలన్నారు. కుటుంబ స్థాయిలోనే నేత్ర ఆరోగ్య సంరక్షణ, నేత్రదానంపై స్పష్టత కల్పించాలన్నారు. అనంతరం ఆమె పిహెచ్‌సి ఆవరణ పరిశుభ్రత, రికార్డులను పరిశీలించారు.వైద్యాధికారులు ఒ.పరిమళ, ఎన్.నందిని, ఆప్తాలమిక్ అధికారి ఎం.ఆర్.కె.దాస్, ఆరోగ్య విస్తరణ అధికారి ఎం.వి.గోవిందరావు, ఆరోగ్య పర్యవేక్షకులు ఎస్.మోహనరావు, జయలక్ష్మి పాల్గొన్నారు.



మెమొంటోను అందజేస్తున్న జోగారావు

ప్రతిభా అవార్డుల ప్రదానం

సంతబొమ్మాళి : మండలంలోని పాతమేఘవరం జెడ్‌పి హైస్కూల్‌లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మత్స్యకార సహకార సంఘం డైరెక్టర్ సూరాడ జోగారావు శనివారం షీల్డ్‌లు, నగదు బహుమతులు అందజేశారు. 569 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన కోడ బిందు రూ.3,000, 561 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన డొంక దివ్య రూ.2,000 అందుకున్నారు. ఈ సందర్భంగా సూరాడ జోగారావు విద్యాభివృద్ధికి తన వంతు కృషి కొనసాగిస్తానని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు మాధవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

పనిభారం తగ్గించాలి

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయం ఉద్యోగులు శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయం ఉద్యోగులు మాట్లాడుతూ వాలంటీర్ల వ్యవస్థ రద్దయిన తరువాత వారి విధులు కూడా తమకే అప్పగిస్తున్నారని అన్నారు. దీనివల్ల పనిభారం పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. జాబ్‌చార్టు ప్రకారం తమకు విధులు అప్పగించాలని, అదనపు పనులు అప్పగించవద్దని కోరారు. కార్యక్రమంలో చక్రధరి, ఉదయ శంకర్ పాత్రో, బి.మౌనిక, గొర్లె రోజ, దామోదర్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి- లావేరు

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి రమేష్ కృష్ణ, ఎల్‌డిఎం శ్రీనివాస్ అన్నారు. యూత్ క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సేవా సంస్థ, జాతీయ వ్యవసాయ గ్రామీణభివృద్ధి బ్యాంకు అమరావతి ఆర్థిక సహకారంతో లావేరు మండలంలోని తాళ్లవలస, రణస్థలం మండలంలోని వెంకటేశ్వర కాలనీలో 60 మంది స్వయం శక్తి సంఘాల మహిళలకు చిరుధాన్యాలతో ఆహార పదార్థాలు తయారీలో అదనపు నూనెను తీసే యంత్ర పరికరం, ఎక్కువ మొతాదులో పిండి కలపడానికి అవసరమైన యంత్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆహార ఉత్పత్తులు తయారీకి అవసరమైన మిషనరీ అందించడం ద్వారా ఎక్కువ వస్తువులు తయారు చేసి ఆర్థికంగా అభివద్ధి సాధించాలన్నారు. నాబార్డ్ ద్వారా మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామని, కలెక్టరేట్, జిల్లా పరిషత్‌ల నందు స్టాల్స్ ఏర్పాటుకు కలెక్టర్ అనుమతి



మాట్లాడుతున్న నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి రమేష్

తీసుకొని స్టాల్ పెట్టిస్తామని తెలిపారు. వ్యక్తిగత యూనిట్లు ఏర్పాటుకు బ్యాంకుల ద్వారా రుణం అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీ మోహనరావు, యూత్ క్లబ్ అధ్యక్షులు మేడూరి ప్రసాదరావు, కార్యదర్శి విజయకుమారి, మహిళా సంరక్షణ కార్యదర్శి బి.సత్యవతి, రెడ్డి గౌరినాయుడు, లుట్ట దుర్గారావు, పైడి నాగమణి, మామిడి సుజాత, మహిళలు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న చినబాబు

ఆశ్రమ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని లబ్బ ఆశ్రమ పాఠశాలను ఐటిడిఎ ఎపిఒ చినబాబు శనివారం సందర్శించారు. హాస్టల్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీతంపేట ఐటిడిఎ పరిధిలోని అన్ని పాఠశాలల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని, అలాచేయని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధానోపాధ్యాయులను, వార్డెన్‌కు హెచ్చరించారు. ఆయన పాఠశాల పరిసరాలను పరిశీలించి పరిసరాలు శుభ్రంగా లేవని అన్నారు. తరగతి గదులు, వసతిగృహ గదులు పరిశీలించి శుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ... పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. విద్యార్థులకు పెడుతున్న భోజనంపై అసహనం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడమే కాకుండా భోజనం రుచికరంగా ఉండాలని ఆదేశించారు. తరగతి గదులు, వసతిగృహ గదుల్లో తప్పనిసరిగా ఫ్యాన్లు, లైట్లు ఉండాలని సూచించారు. పాఠశాల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి డిప్యూటీ వార్డెన్‌కు ఛార్జ్ మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ, సిబ్బంది పాల్గొన్నారు.

6 గంటలకే వార్డుల్లో ఉండాలి

ప్రజాశక్తి- పలాస

సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది ఉదయం 6 గంటలకు వార్డుల్లో ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు దిశానిర్దేశం చేశారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో ఎమినిటి కార్యదర్శులు, ప్లానింగ్ కార్యదర్శులు, శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ కార్యదర్శులు, శానిటేషన్ సూపర్వైజర్లు, మున్సిపల్ కార్యాలయ సిబ్బందితో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో పైన పేర్కొన్న ముగ్గురు కార్యదర్శులతో కూడిన టీమ్‌లను రోజూ ఉదయం 6



మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

నుంచి 9 గంటల వరకు ప్రతి వార్డు, వీధుల్లో కలిసి తిరగాలన్నారు. సమస్యలను గుర్తించి అక్కడకి అక్కడే పరిష్కరించుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. శానిటేషన్, తాగునీటి సరఫరా వంటి విషయంపై దృష్టిసారించాలన్నారు.



టేకు మొక్కలను అందుకుంటున్న విద్యార్థులు

టేకు మొక్కల పంపిణీ

ఇచ్ఛాపురం: స్థానిక శాంతినికేతన విద్యా సంస్థల్లో లోక్‌సత్తా సంస్థ, మాత ఆధ్వర్యాన శనివారం టేకు మొక్కలను పంపిణీ చేశారు. పిఎఫ్ఎల్ ప్రెసిడెంట్ ప్రకాష్ కపిల్ మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో ఈ ఏడాది టేకు మొక్కలను పంపిణీ చేశామన్నారు. రైతులకు అదనపు ఆదాయం కల్పించడమే లక్ష్యంగా టేకు మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. లోక్‌సత్తా జిల్లా నాయకులు, శాంతిని కేతన్ స్కూల్ చైర్మన్ డి.కృష్ణమూర్తిరెడ్డి ఆధ్వర్యాన కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులకు 200 మొక్కలను పంపిణీ చేశారు. ఆదిత్య కళాశాల ఇచ్ఛాపురం విద్యార్థులకు, సిబ్బందికి 800 మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు శేఖర్, కామేష్, కరస్పాండెంట్ రమణ, స్కూల్ మేనేజర్ కె.సి.పూరి, ఉపాధ్యాయులు సురేఖ, శాంతి, రాజ్యలక్ష్మి, స్నేహ, మీనా, పార్వతి, రవి, శిరీష పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ


ప్రజాశక్తి- పలాస

మహిళలకు రక్షణగా శక్తి మొబైల్ యాప్ ఉపయోగపడుతుందని కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అపారావు అన్నారు. సూర్యతేజ జూనియర్ కళాశాలలో శనివారం శక్తి యాప్ ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మీ మొబైళ్లలో శక్తి యాప్ నిక్షిప్తం చేసుకోవాలన్నారు. ఆపద, అత్యవసర సమయంలోనే పోలీసులు సహయం పొందాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, భద్రత, రక్షణకు ఈ యాప్‌ను అందుబాటులోనికి తీసుకొచ్చిందన్నారు. ఈ యాప్ రిజిస్ట్రేషన్‌కు శక్తి బృందాలు కళాశాల, పాఠశాల



మాట్లాడుతున్న డిఎస్‌పి వెంకట అప్పారావు

విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలు అత్యవసర సమయంలో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా శక్తి యాప్ ద్వారా డయల్ 112, ఎన్‌డిఎన్ బటన్ ద్వారా ఫిర్యాదు చేసుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దానేటి పద్మజ కామేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



కుర్చీలు అందజేస్తున్న ధనుంజయరెడ్డి

కుర్చీలు, ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని టి.బరంపురం ప్రాథమిక పాఠశాలకు గ్రామస్తులు ఫ్యాన్లు, కుర్చీలు వితరణ చేశారు. ఇదే గ్రామానికి చెందిన తిప్పన ధనంజయరెడ్డి, ధూపాన నూకరాజులు ఆరు కుర్చీలను, పేరెంట్స్ ఎస్‌ఎంసి చైర్మన్, సభ్యులు కలిపి రెండు ఫ్యాన్లను ప్రధానోపాధ్యాయులు కోలా ధనలక్ష్మికి సర్పంచ్ కారింగి త్రినాథరెడ్డి సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసి చైర్మన్ ధూపాన రాజ్యలక్ష్మి, ఉప చైర్మన్ మమత, ఉపాధ్యాయులు ధనలక్ష్మి, శ్రావణి, గ్రామస్తులు ఎదురు కేదారి, దక్కత మోహనరావు, వాసు, నూకరాజు పాల్గొన్నారు.



జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆర్‌డిఒ వెంకటేష్

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

ఆర్‌డిఒ వెంకటేష్

ప్రజాశక్తి- పలాస

మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఆర్‌డిఒ జి.వెంకటేష్ అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్‌లో పెంచిన పది వేల మొక్కలను జిల్లాలో వంద పాఠశాలలకు ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమం శనివారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విద్యా విహార్ ఆవరణలో మొక్కలు నాటారు. మానవాళి మనుగడకు మొక్కలు ఎంతగానో దోహదవడతాయని అన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థలు రాష్ట్ర స్థాయి అధ్యక్షులు రఘు పాత్రుని లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షులు నూర రామచంద్రరరావు, ప్రేమతరూ ఇన్‌ఛార్జీ బోయిన చంద్రమౌళి, ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ఉప అధ్యక్షులు తాళాను శ్రీనివాసరావు, మల్లా శరత్, భైరాగి, జామి శ్రీను, కందుల కాశి, కొంచాడ నూకరాజు, గుండ్ల లింగరాజు, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, పలాస, మందస, వజ్రవుకొత్తూరు మండలాల తహశీల్దార్లు, ఎంఇఒలు పాల్గొన్నారు.



కూపన్ పరిశీలిస్తున్న వ్యవసాధికారులు

ఎరువుల విక్రయాలు పరిశీలన

ప్రజాశక్తి- సోంపేట

గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల ద్వారా కూపను పద్ధతిలో ఎరువుల పంపిణీ పంపిణీ చేస్తున్నామని వ్యవసాయ సహాయ సంచాలకులు టి.భవానీశంకర్ తెలిపారు. మండలంలోని బారువ, బెంకిలి, సోంపేట రైతు సేవా కేంద్రాలను ఎఒ బి.నరసింహమూర్తితో కలిసి శనివారం పరిశీలించారు. సందర్భంగా మాట్లాడుతూ మొదటి దశలో రైతు సేవా కేంద్రాలు, డిసిఎంఎస్‌తో కలిపి 2001 టన్నులు సరఫరా అయ్యిందన్నారు. వచ్చే రెండు రోజుల్లో ఇంకా 36 టన్నులు కేంద్రాలకు చేరనుందని తెలిపారు. రైతుల సిఫార్సుకు మించి యూరియా వాడితే అక్టోబరు, నవంబరు నెలల్లో వాతావరణ పరిస్థితులకు చీడ, పీడలు ఎక్కువ అవుతాయని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చైల్డ్‌కేర్ సెలవులు రెండేళ్లు పెంచాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

చైల్డ్ కేర్ సెలవులు రెండేళ్లు పెంచాలని ఎపిజెఎసి అమరావతి మహిళా విభాగం చైర్ పర్సన్ కురమాన ప్రవల్లిక ప్రియ డిమాండ్ చేశారు. ఎపిజెఎసి అమరావతి మహిళా విభాగం ఏర్పాటై రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం రెవెన్యూ భవన్ నందు ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఆమె మట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లుగా రెండేళ్లు ఇస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కేవలం ఆరు మాసాలు మాత్రమే చైల్డ్ కేర్ లీవ్ ఇస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు కూడా రెండేళ్లు చైల్డ్ కేర్ లీవ్ మంజూరు చేయాలని కోరారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ఐఆర్ ఇప్పటికీ ప్రకటించకపోవడం, ఇప్పటికే రావాల్సిన నాలుగు డిఎలు ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు అరుణకుమారి, శ్రీరాములు, వెంకటరమణ పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న చంద్రమోహన్

రాజేష్‌కు పరామర్శ

కవిటి: కళింగ కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి లోళ్ల రాజేష్‌ను జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ శనివారం పరామర్శించారు. రాజేష్ తల్లి లోళ్ల కృష్ణవేణి ఇటీవల మతి చెందిన నేపథ్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం రాజేష్‌తో మాట్లాడి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో కవిటి మండల నాయకులు బైపెల్లి దాలయ్య, ప్రశాంత్, కిషోర్, పిఎసిఎస్ సభ్యులు బోగిడియ రాజశేఖర్, ఢిల్లీ, పెద్దింటి రవీంద్ర వర్ధన్, డొంక ఉమాపతి, శాంతారావు, హరే కృష్ణ, గుజ్జుల శంకర్, చీకటి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువ కేసులు రాజీ చేయాలి

పలాస : ఈ నెల 13న నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేవిధంగా చూడాలని పలాస జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి అన్నారు. పలాస కోర్టు ఆవరణలో పలాస, వజ్రవుకొత్తూరు మండల అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందస్తు లోక్ అదాలత్‌లు కూడా నిర్వహించి కేసులు రాజీ చేసుకునే అవకాశం ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న రాజీ పడే క్రిమినల్ కేసులు రాజీ చేసుకునే ఈ అవకాశాన్ని కక్షిదారులకు తెలియజేయాలన్నారు.

'పైల'కు ఘన నివాళి

ఇచ్ఛాపురం : మండలం పిఎసిఎస్ సొసైటీ మాజీ అధ్యక్షులు పైల రుక్మంగాధర్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గౌతు శ్యామ్ సుందర్ శివాజీ శనివారం తులసిగాం వెళ్లి పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మణి చంద్రప్రకాష్, మాజీ ఎంపిపి దక్కత ఢిల్లీరావు, డి.కామేశ్వరరావు, ఆశి లీలారాణి, పైల పురుషోత్తం, బి.కామేష్, బి.అప్పన్న వి.రమేష్, పైల హేమరాజు, ఇ.సరాతి, ఎం.భైరాగి పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న శివాజీ